


# వార్త మిర్రర్


తెలుగు దినపత్రిక

బుధవారం,
మే 14, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-

## పాలన అంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోయడం కాదు

### కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గన్నీ బ్యాగుల కొరత



ధాన్యం కేంద్రాల్లో కనీస సౌకర్యాలు మృగ్యం

రైతుల ఆత్మహత్యలకు మీరే కారణం

బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు

నేను క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను

కెసిఆర్ ఆదేశాలు తు.చ తప్పకుండా పాటిస్తా

కెటిఆర్‌ను పార్టీ అధ్యక్షుడిని చేసినా అనుసరిస్తా

పార్టీ మారడం అన్న ప్రచారంలో నిజం లేదు: హరీష్

**హైదరాబాద్:** ప్రభుత్వాన్ని నడపడం అంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోసినంత సులువు కాదని.. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి సారించాలని.. రైతుల కష్టాలను తీర్చాలని డిమాండ్ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. రైతులను గాలికి వదిలేసి.. అందాల పోటీ-లు నిర్వహిస్తున్న తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గన్నీ బ్యాగులను సమకూర్చడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ధాన్యాన్ని లారీలకు ఎక్కించే హమాలీలను సమకూర్చడంలో విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో

మిగతా 2లో



## ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టాల్సిందే

అది మన సంప్రదాయం..విధానం కూడా

వీర సైనికులు అందరిరకీ సెల్యూట్ చేస్తున్నా

ప్రపంచమంతా మార్మోగిన ఆపరేషన్ సిందూర్ నినాదం

యుద్ధక్షేత్రంలో జై భారత్ మాతా నినాదాలు

ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన మోడీ

సైనికులకు సెల్యూట్ చేసి ముచ్చటించిన ప్రధాని

2లో

## కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస పోరాటాలకు సిద్ధం కావాలి: కేటీఆర్



**హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస పోరాటాలకు సిద్ధం కావాలని భారాస శ్రేణులకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతుల ఆత్మహత్యలు, వారి సమస్యల పరిష్కారంపై రాబోయే రోజుల్లో భారాస విస్తృత పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నేతలతో కేటీఆర్ హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు భరోసా చెల్లింపులు సక్రమంగా జరగకపోవడం, ధాన్యం కొనుగోళ్లలో చూపిస్తున్న నిర్లక్ష్యంపై, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా పార్టీ కార్యాచరణ ఉండబోతోందన్నారు. నిరుద్యోగులకు మాట ఇచ్చినట్టుగా నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంతో

మిగతా 2లో



## సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదు

### రాజీవ్ యువ వికాసం స్కీమ్‌పై భట్టి

**భద్రాద్రి కొత్తగూడెం:** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం స్కీమ్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే.. సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ప్రచారం జరగడంతో యువతలో ఆందోళన నెలకొంది. గ్రామ యువతకు సిబిల్ స్కోర్‌పై పెద్దగా అవగాహన ఉండదని.. స్కీమ్ గైడ్ లైన్స్‌లో ఈ అంశాన్ని చేర్చొద్దని పలువురు డిమాండ్

మిగతా 2లో

## ఆసుపత్రుల నిర్మాణంలో ఆలస్యం

### అధికారుల తీరుపై మండిపడ్డ కోమటిరెడ్డి

**హైదరాబాద్:** సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం ఆలస్యం అవుతుండడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. కుంటిసాకులతో నిర్మాణాలను ఆలస్యం చేయడంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంట్రాక్టర్లతో పని చేయించడం కూడా రాదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలపై మంత్రిసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులు వికాస్ రాజ్, హరి చందన, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సనత్ నగర్ లో ఆస్పత్రిని జూన్ 2వ తేదీన ప్రారంభించాలని తెలంగాణ ప్రభుత్వం టార్గెట్ గా పెట్టుకున్నా.. పనులు ఎందుకు వేగంగా కొనసాగడం లేదని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. ఎప్పటి వరకు 5 సూపర్ స్పెషాలిటీ- ఆసుపత్రులు నిర్మాణం పూర్తి చేస్తారో టెక్నికల్ గా అంచనా వేసి రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక, ఆసుపత్రులకు సంబంధించిన నిర్మాణ పనులను ఆర్ అండ్ బీ, వైద్య పరికారాలను వైద్యారోగ్య శాఖ ఎస్టిమేట్ వేసుకోవాలని సూచించారు.






## దేశంలో తుర్కియా వ్యతిరేక నినాదం

### ఆ దేశ యాపిల్ల అమ్మకాలపై నిషేధం

**పుణె:** పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్‌కు తుర్కియే అనుకూలంగా వ్యవహరించడం పై దేశవ్యాప్తంగా వ్యతిరేకత వస్తోంది. దీంతో టర్కీ ఎర్డోగాన్ ప్రభుత్వం తీరుపై మనదేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. 'బాయ్‌కాట్ తుర్కియే' పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. తాజాగా 'బ్యాన్ తుర్కియే' అంటూ

మిగతా 2లో



## దద్దమ్మగా ఉన్న నిన్ను తంతే బీజేపీలోకి వెళ్లావు..

ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నట్టున్నావు

అధ్యక్ష పదవి రాలేదన్న ఆక్రోశాన్ని రేవంత్‌పై వెళ్లగక్కుతున్నావు

ఒక్క విజిల్ వేస్తే.. కాంగ్రెస్ కార్యకర్తలు ఏం చేస్తారో మాకే తెలియదు

2లో

బీజేపీ ఎంపీ ఈటలపై పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ధ్వజం



## చార్మినార్ వద్ద సుందరీమణుల సందడి

గ్రూప్ ఫోటోలు దిగిన అందాల అతివలు

లాడ్ బజార్‌లో షాపింగ్ చేసిన ముద్దుగుమ్మలు

2లో

## పదవీవిరమణ చేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా

ఘనంగా వీడ్కోలు పలికిన బార్ అసోసియేషన్

తదుపరి ఎలాంటి పదవులు చేపట్టబోనన్న ఖన్నా

నేడు సుప్రీం చీఫ్ జస్టిస్‌గా గవాయ్ ప్రమాణం

రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించనున్న ముర్ము

2లో



# పాలన అంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోయడం కాదు

మొదటి పేజీ తరువాయి

కనీస సౌకర్యాలు కల్పించడంలో, గొప్పగా చెప్పిన బోనస్ అందజేయడంలో ఘోర వైఫల్యమంటూ ధ్వజమెత్తన్నారు. గత అసెంబ్లీలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ మా ప్రభుత్వంలో తరుగు తీమయని చెప్పారని.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో జెట్టి రాజు అనే రైతు క్వింటాల్‌కు పది కిలోలు తరుగు తీస్తున్నారని ఆత్మహత్య చేసుకున్నాన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో రైతులు ఆందోళన చేపట్టారన్నారు. తాలు, తరుగు పేరుతో రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వేసిన తూకం కంటే మిల్లర్లు తక్కువ ధాన్యాన్ని చూపుతూ రైతులకు నష్టం కలిగిస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించడానికి 3-4 రోజులు, మిల్లుల దగ్గర అన్‌లోడ్ చేయడానికి మరిన్ని రోజులు ఆలస్యం జరుగుతందని.. ఫలితంగా రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆవేనద వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ట్రక్ షీట్ విధానం అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పినా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. పండిన పంటను అమ్ముకోవడానికి రైతులు 10-10 రోజులు కొనుగోలు కేంద్రాల్లో వేచి చూడాల్సిన దుస్థితి ఎదురైందని.. ఈ ప్రభుత్వం మాటలు ఘనం చేతలు శూన్యం అంటూ విమర్శలు గుర్పించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడం వల్ల రోజుల తరబడి ఎండలో వేచి చూడడం వల్ల రైతులు పిట్టల్లా రాలిపోతున్నారన్నారు. మే 13న మహబూబాబాద్ జిల్లా పోచంపల్లిలో గగులోతు కిషన్ మృతి చెందారని, 15న జగిత్యాల జిల్లా కథలాపూర్‌లో జలపతి రెడ్డి చనిపోయారని తెలిపారు. ఏప్రిల్ 21న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు చెర్లపాలెంలో హనుమండ్ల ప్రేమలత మృతి, ఏప్రిల్ 22న నెల్లికుదురు మండలం మదనతుర్తిలో బీర్రు వెంకన్న, 26న సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో చింతకింది హనుమయ్య మృతి చెందారన్నారు. ధాన్యపు రాశు



లే సాక్షంగా.. కొనుగోలు కేంద్రాల్లోనే జరుగుతున్న ఈ రైతు మరణాలు ప్రభుత్వపు హత్యలేనన్నారు. ఇవి సహజ మరణాలు కావు, ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగినవే హత్యలేనని ఆరోపించారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అందాల పోటీల మీద పోలీస్ కమాండ్ కంట్రోల్, జూబ్లీహిల్స్ ప్యాలస్‌లో రివ్యూలు పెడుతున్నారని.. సెక్రటేరియట్ ముఖం కూడా ముఖ్యమంత్రి చూడడం లేదని విమర్శించారు. రైతు సమస్యలపై ఎందుకు ముఖ్యమంత్రి రివ్యూ పెట్టడం లేదని ప్రశ్నించారు. ఫ్రబవరి నెలలో కట్టాల్సిన రైతు బీమా ప్రీమియం కట్టకపోవడం వల్ల చనిపోయిన రైతులకు రైతు బీమా అందడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు వివిధ జిల్లాల్లో ధాన్యం కొనుగోలుపై రైతులు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. నాగర్ కర్నూలు జిల్లా జటప్రోలులో అకాల వర్షానికి తడవడంతో రైతులు రాస్తారోకో చేశారని.. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేశారని హరీశ్‌రావు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల గ్రామంలో సన్న వడ్ల కొనుగోలు లేకపోవడంతో రైతులు సిరిసిల్ల-సిద్దిపేట రహదారిపై ధర్నా చేశారని చెప్పారు. వనపర్తి పట్టణంలోని చిట్యాల మార్కెట్ యార్డు వద్ద వర్షాలకు వేలాది బస్తాల వరి, మొక్కజొన్న ధాన్యం తడిసిందని.. కాంటా జాప్యం, తరలింపు ఆలస్యాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఎర్వ చింతల్‌లో తూకంలో మోసాలపై పీఏసీఎస్ నిర్వాహకులను రైతులు ఘోరావ్ చేసి తక్షణ చర్యలకు డిమాండ్ చేశారని తెలిపారు. రైతులు ఎండకు ఎండి వానకు తడిచిపోతుంటే ఎందుకు ప్రభుత్వం మొద్దు నిద్రపోతున్నదని.. ప్యాలెస్‌లో అందాల పోటీ-లపై రివ్యూలా..ఝ మిమ్మల్ని నమ్మి ఓట్లు- వేసినా రైతులకు ఏమో మోసమా మండిపడ్డారు. వరంగల్ రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అయినా అమలు చేశారా? అంటూ నిలదీశారు. రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలకు రాహుల్ గాంధీ సాక్ష్యమన్నారు. రాహుల్ గాంధీ వరంగల్‌లో రైతులకు ఇచ్చిన హామీలపై ఏమని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయమని ముఖ్యమంత్రి అడిగితే ఢిల్లీకి వెళ్తే చెప్పులు ఎత్తుకెళ్లే వారిలా చూస్తున్నారని.. ఎవ్వడు నమ్మి అప్పు ఇవ్వట్లేదు అంటు-న్నారన్నారు. చివరికి పాకిస్తాన్‌ని నమ్మి అప్పు ఇస్తున్నారు కానీ రేవంత్ రెడ్డిని నమ్మి అప్పు ఇవ్వడం లేదన్నారు. ప్రతిపక్షం మీద బురదజల్లబోయి నువ్వు తీసుకున్న గోతిలో నువ్వేపడ్డావు అంటూ మండిపడ్డారు. ప్రభుత్వాన్ని నడపడం అంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోసినంత సులువు కాదని.. ఇప్పటి-కై-నా ముఖ్యమంత్రి పాలనపై దృష్టి సారించి, రైతుల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు నష్టం జరగకుండా చూడాలని.. సీఎం అసెంబ్లీలో ఉపన్యాసాలు ఇచ్చుడు కాదని.. తరుగు, తాలు పేరు మీద ఐదు నుండి పది కిలోలు తరుగు తీస్తున్నారు కాబట్టి తరుగు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తుందని హెచ్చరిస్తున్నామన్నారు.

**నేను క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను**

భారాసలో ఎలాంటి విభేదాలు లేవని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను. కేసీఆర్ తర్వాత కేటీఆర్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తా. గతంలో కూడా ఈ అంశంపై చాలాసార్లు స్పష్టత ఇచ్చా. కార్యకర్తగా కేసీఆర్, పార్టీ ఆదేశాలను పూర్తిగా పాటిస్తా. కేసీఆర్ నిర్ణయాలకు పూర్తిగా కట్టుబడి ఉంటానని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కార్యకర్తగా మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. తాను పార్టీ మారుతున్నట్టు- సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. ఈ మేరకు హరీష్ రావు మాట్లాడుతూ.. కెసిఆర్ మా అధ్యక్షుడు.. ఆయన చెప్పింది నేను తూ.చా. తప్పకుండా పాటిస్తానని అన్నారు. ఈ మాట తాను ఇప్పటికే చాలా సార్లు చెప్పానని.. ఎన్ని సార్లు అడిగిన ఇదే చెప్తానన్నారు. బిఆర్ఎస్ పార్టీలో ఎలాంటి విభేదాలు లేవన్నారు. కెటిఆర్ కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే.. తప్పకుండా స్వాగతిస్తానని చెప్పారు. ఒక కార్యకర్తగా పార్టీ నిర్ణయాన్ని, కెసిఆర్ నిర్ణయాన్ని ఎప్పుడు శిరసావహిస్తానని హరీష్ రావు క్లారిటీ-ఇచ్చారు.


# పదవీవరమణ చేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా

**న్యూఢిల్లీ:** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీకాలం మంగళవారం తో ముగిసింది. సుప్రీంకోర్టులో చివరి రోజు బెంచ్ కార్యలాపాలు ముగిసిన తర్వాత ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో జస్టిస్ ఖన్నా మాట్లాడారు. తదుపరి ఎటువంటి అధికారిక పదవులను చేపట్టనని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థలోనే ఏదైనా చేయాలనుకుంటున్నానని చెప్పారు. మరోవైపు జస్టిస్ ఖన్నా పదవీ విరమణ నేపథ్యంలో సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసింది. భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా గతేడాది నవంబర్ 11 బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాకు దివంగత మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా సమీప బంధువు. 2005లో దిల్లీ హైకోర్టు అదనపు జడ్జీగా నియమితులైన జస్టిస్ ఖన్నా.. ఆ మరుసటి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా ఉన్నతి పొందారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, నవంబర్ 11న సీజేఐగా బాధ్యతలు చేపట్టారు. ఖన్నా పదవీవిరమణతో భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ మే 14న బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నూతన సీజేఐతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. సీనియారిటీ పరంగా తన తర్వాత స్థానంలో ఉన్న జస్టిస్ గవాయ్ పేరును.. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా గతంలోనే సిఫారసు చేయడంతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 6 నెలలకుపైగా సీజేఐ పదవిలో కొనసాగనున్న జస్టిస్ గవాయ్.. నవంబరు 23న పదవీ విరమణ చేస్తారు. డీవై చంద్రచూడ్ పదవీ విరమణతో ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నా 2024 నవంబర్‌లో ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆరు నెలలు మాత్రమే సేవలందించారు. దీంతో ఆయన పదవీ కాలం ముగిసింది. ఈ క్రమంలో భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ నేడు రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.జస్టిస్ సంజీవ్ ఖన్నా.. న్యూఢిల్లీలో 1960, మే 14న జన్మించారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రాన్ని చదివారు. ఢిల్లీ హైకోర్టులో 2005లో అదనపు న్యాయమూర్తిగా నియమితుల య్యారు. 2006లో శాశ్వత జడ్జి అయ్యారు. 2019, జనవరి 18న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టు జడ్జిగా ఆయన పలు ప్రముఖ తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల వినియోగాన్ని ఆయన సమర్థిస్తూ.. అవి పూర్తి భద్రమైనవని, దాని వల్ల బోగస్ ఓట్లు, బూత్‌ల రిగ్గింగ్‌ను అరికట్టవచ్చునని పేర్కొన్నారు. అలాగే ఎలక్టోరల్ బాండ్లపై సంచలన తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో ఖన్నా కూడా ఉన్నారు. 370 అధికరణ రద్దును సమర్థిస్తూ తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో కూడా ఆయన సభ్యుడే. కాగా తదుపరి సీజేఐగా జస్టిస్ గవాయ్ పేరును సీజేఐ ఖన్నా ఏప్రిల్ 16న కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

2019 మే 24న సుప్రీంకోర్టుకు పదోన్నతిపై వచ్చిన జస్టిస్ గవాయ్ సీజేఐగా ఆరు నెలలకుపైగా కొనసాగుతారు. 2025 నవంబర్ 23న ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న రెండో దళిత న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ కావడం విశేషం. గవాయ్ పూర్తిపేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించిన జస్టిస్ గవాయ్.. 1985 మార్చి 16న బార్‌లో సభ్యుడిగా చేరారు. 2003 నవంబర్ 14న బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2005 నవంబర్ 12న అదే హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

# ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టాల్సిందే

**చండీఘడ్:** ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టడం.. మన సంప్రదాయం.. మన విధానమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మన సైన్యం చూపిన శక్తి సామర్థ్యాలు భావితరాలకు గొప్ప ప్రేరణ అని ఆయన అభివర్ణించారు. ఈ భూమి నుంచి వీర సైనికులు అందరికీ తాను సెల్యూట్ చేస్తున్నారన్నారు. వీర సైనికుల పరాక్రమంతో ఆపరేషన్ సిందూర్ నినాదం.. ప్రపంచమంతా మార్మోగు తోందని తెలిపారు. మంగళవారం పంజాబ్‌లోని అదంపూర్ ఎయిర్‌బేస్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ సందర్భంగా సైనికులతో ఆయన మాట్లాడారు. అనంతరం సైనికులను ఉద్దేశించి ప్రసంగించారు. మన సైన్యం చేపట్టిన ఈ పరాక్రమం.. భారత్ సామర్థ్యానికి ప్రతి రూపమని పేర్కొన్నారు. భారత్ చూపిన ఈ పరాక్రమం.. త్రివిధ దళాల త్రివేణీ సంగమమన్నారు. పాకిస్థాన్‌కు భారత వాయుసేన తన సత్తా చాటిందంటూ ప్రశంసల జల్లు కురిపించారు. యుద్ధ క్షేత్రంలోనూ భారత్ మాతాకీ జై నినాదాలు చేశామని.. ఈ జయ జయ ద్వానాలు ప్రపంచమంతా విన్నదని ఆయన గుర్తు చేశారు. భారత్ మాతాకీ జై అనేది ప్రతీ పౌరుడి నినాదమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అణు బాంబు హెచ్చరికలను సైతం చిత్తు చేశామని చెప్పారు. దేశంలోని ప్రతీ పౌరుడూ గర్వపడేలా మీరు చేశారంటూ సైనికులను ఈ సందర్భంగా ప్రధాని మోదీ అభినందించారు. మీరందరూ చరిత్ర సృష్టించారంటూ సైనికులను వెన్నుతట్టి ప్రోత్సహించారు. మీ కోసమే నేను ఇక్కడికి వచ్చానని చెప్పారు. వీరులను చూసినప్పుడు జీవితం ధన్యమవుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.'భారత్ మాతాకీ జై' నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని ప్రధాని మోదీ అన్నారు. అది శత్రువుల వెన్నులో వణుకు పుట్టించిందని వ్యాఖ్యానించారు.





ఉగ్రవాదాన్ని అంతం చేయాలని మన సైన్యం శపథం చేసింది. మన సైన్యం చూపిన శక్తిసామర్థ్యాలకు ఎన్ని ప్రశంసలు చేసినా తక్కువే. అణు బ్లాక్‌మెయిల్‌ను అపహాస్యం చేసింది. భారత శక్తిసామర్థ్యాలు చూసి నా జీవితం ధన్యమైంది. యుద్ధక్షేత్రంలోనూ భారత్ మాతాకీ జై నినాదాలు చేశాం. ఆకాశం నుంచి పాతాళం వరకు ఆ నినాదం మార్మోగింది. ఈ భూమి నుంచి వీర సైనికులు అందరికీ సెల్యూట్ చేస్తున్నా. ప్రతి భారతీయుడు సైన్యానికి మద్దతుగా నిలబడ్డాడు. భారత సేనలకు కృతజ్ఞతలు చెప్తున్నాడు. ధర్మసంస్థాపన కోసం ఆయుధం పట్టడం మన సంప్రదాయం.. మన విధానం. మన అక్కాచెల్లెళ్ల నుదుటి సిందూరం తుడిచినవాని నట్టింట్లోకి వెళ్లి నాశనం చేశాం అని ప్రధాని ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా మన భద్రతా బలగాలు ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించాం. అది జీర్ణించుకోలేని పాకిస్తాన్ మే 9, 10వ తేదీల్లో దాడులకు యత్నించింది. అయితే వాటిని మన సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. దాయాది టార్గెట్ చేయాలని యత్నించిన వాటిలో ఆదంపుర్ వైమానిక స్థావరం కూడా ఒకటి. ఈ ఉదయం నేను ఆదంపుర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లాను. అక్కడ మన పోరాటయోధులను కలిశాను. ధైర్యం, దృఢ సంకల్పానికి ప్రతిరూపంగా నిలిచేవారితో మాట్లాడటం ఒక ప్రత్యేక అనుభవం. మన దేశ రక్షణ కోసం బలగాలు చేసే ప్రతిచర్యకు ప్రజలందరూ ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటారని ఎక్స్ వేదికగా మోదీ రాసుకొచ్చారు. అలాగే వారితో దిగిన చిత్రాలను షేర్ చేశారు. అక్కడికి వెళ్లి పాక్ చేసిన తప్పుడు సమాచారాన్ని తిప్పికొట్టారు. వాయుసేన సిబ్బందితో ముచ్చటించి భుజం తట్టారు. ఆపరేషన్ వివరాలను మోదీకి బలగాలు వివరించాయి. గంటన్నరకు పైగా ఆయన అక్కడే గడిపారు. ఆ సమయంలో ఆయన ధరించిన టోపీపై త్రిశూల్ చిత్రం కనిపించింది. ఆపరేషన్ సిందూర్ గురించి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మరుసటిరోజు మోదీ ఈ పర్యటన చేపట్టారు. నిన్న ప్రధాని మాట్లాడుతూ.. భారత్ ప్రళయభీకర దాడులను తట్టుకోలేకే పాకిస్థాన్ చివరకు కాల్పుల విరమణ పేరుతో కాళ్లబేరానికి వచ్చిందని వెల్లడించిన సంగతి తెలిసిందే. నవయుగ యుద్ధంలో పాకిస్థాన్‌ను భారత్ మట్టి కరిపించిందని, వారు సరిహద్దుల్లో యుద్ధానికి దిగితే మనం వాళ్ల గుండె పైనే కొట్టగలిగామన్నారు. ఆ దేశ ప్రవర్తనను పరిశీలిస్తామని, ముున్ముందు ఏమాత్రం తేడా వచ్చినా ఊరుకోబోమని హెచ్చరించారు. పహల్గాంలో ఉగ్రవాదులు వికృత క్రూరత్వాన్ని ప్రదర్శించి.. కుటుంబ సభ్యుల ముందే అమాయక ప్రజలను చంపినందుకు ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర సౌధాలను కుప్పకూల్చి 100 మందికి పైగా పేరుమోసిన ఉగ్రవాదులను అంతమొందించినట్లు- ప్రకటించారు. ఆ దేశంతో చర్చలంటూ జరిగితే ఉగ్రవాద నిర్మూలన, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై మాత్రమేనని స్పష్టంచేశారు.

## మొదటి పేజీ తరువాయి

### కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస పోరాటాలకు సిద్ధం కావాలి: కేటీఆర్

పాటు ఇటీవల వెలుగుచూసిన ఉద్యోగ నియామకాల్లో అవకతవకలపై సమగ్ర వ్యూహంతో ప్రజా ఉద్యమాలు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత భారీ సభగా ఎల్కతుర్తి సభ నిలిచిపోతుందన్న కేటీఆర్.. విజయానికి కారణమైన ప్రతి కార్యకర్త, నేతకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర రాజకీయాలకు ఎప్పుడూ కేంద్ర బిందువు భారాస పార్టీయే అన్న ఆయన.. వరంగల్ సభ తర్వాత ప్రజలు, కార్యకర్తల్లో ఓ పాజిటివ్ ఎనర్జీ వచ్చిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలపై అలుపెరగని పోరాటం చేసే ఉత్సాహం కలిగిందని.. రాష్ట్ర ప్రజలకు ఏనాటికైనా భారాసనే శ్రీరామరక్ష అన్న సంగతి మరోమారు నిరూపితం అయిందని అన్నారు.

### సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదు

చేస్తున్నారు. ఈ క్రమంలో రాజీవ్ యువ వికాసం స్కీముపై డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క క్లారిటీ- ఇచ్చారు. సిబిల్ స్కోర్‌తో రాజీవ్ వికాసం స్కీమ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. అవగాహన లేని కొన్ని సోషల్ మీడియా, ఇతర సంస్థలు సిబిల్ స్కోర్ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఈ స్కీమ్‌కు సంబంధించి మండల స్థాయిలో ప్రాసెస్‌ను ప్రారంభమైందని.. జూన్ రెండవ తేదీ కల్లా లబ్ధిదారులకు మంజూరు లెటర్లు అందజేస్తామన్నారు. నిరుద్యోగ యువత తలెత్తుకొని బతికెందుకు రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకొచ్చామని చెప్పారు. మంగళవారం భద్రాద్రి కొతగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం, టేకులపల్లి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు భట్టి శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం లాంటి స్కీమ్ భారత దేశంలోనే ఎక్కడ లేదని అన్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువకులు వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడేందుకు స్వయం ఉపాధి అవకాశాన్ని ఎంచుకొని ఎదగడానికి రాజీవ్ యువ వికాసం స్కీమ్ ఒక వరం లాంటిదన్నారు. పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎలాంటి భృతిని, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని మండిపడ్డారు. గత పది సంవత్సరాలు తెలంగాణ యువత నిరాశ నిస్పృహల్లో బతికిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 52,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. మిగిలిన ఉద్యోగాల భర్తీకి కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటించామని గుర్తు చేశారు. ఇల్లందు నియోజకవర్గంలోని తులారం ప్రాజెక్ట్, బయ్యారం పెద్ద చెరువు మరమ్మత్తులతో పాటు- ఇల్లందు ప్రాంతంలో సర్వే చేసి నివేదికను తయారుచేసి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు.

### దేశంలో తుర్కియా వ్యతిరేక నినాదం

పలువురు వ్యాపారులు కూడా ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులను విక్రయించేందుకు నిరాకరిస్తున్నారు. పాక్‌తో ఉద్రిక్త పరిస్థితుల వేళ దేశంలో బాయ్‌కాట్ తుర్కియే నినాదం ఊపందుకుంది. ఈ క్రమంలో తాజాగా పుణెలోని వ్యాపారులు కూడా ఆ దేశం యాపిల్‌లను బహిష్కరిస్తున్నట్లు- నిర్ణయం తీసుకున్నారు. దీంతో స్థానిక మార్కెట్‌లో అవి కనిపించకుండా పోతున్నాయి. స్థానికులు కూడా ఇతర ప్రదేశాల నుంచి దిగుమతయ్యే పండ్లను తీసుకుంటున్నారు. పుణెలో మార్కెట్‌లో తుర్కియే యాపిల్‌ల సీజన్ టర్నోవర్ రూ.1000 నుంచి 1200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీంతో వ్యాపారుల తాజా నిర్ణయం పండ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ప్రభుత్వానికి, సాయుధ బలగాలకు సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంటున్నారు.

### చార్మినార్ వద్ద సుందరీమణుల సందడి

**హైదరాబాద్:** ప్రపంచ సుందరీమణులు మంగళవారం సాయంతరి హైదరాబాద్ పాతబస్తీలో సందడి చేశారు. చార్మినార్ దగ్గర 109 దేశాల అందగత్తెలకు రెడ్ కార్పెట్ తో.. సంప్రదాయ అరబ్బీ మర్ఫా సంగీతంతో స్వాగతం పలికారు. చార్మినార్ అందాలను, చుట్టుపక్కల ప్రాంతాలను తమ సెల్ ఫోన్లలో బంధించుకున్నారు. ఆ తర్వాత చార్మినార్ దగ్గర ప్రత్యేక ఫోటో షూట్‌నిర్వహించారు. లాడ్ బజార్ లోని తొమ్మిది ప్రముఖ దుకాణాల్లో ఈ సుందరీమణులు షాపింగ్ చేసారు. గాజులు, ముత్యాల హారాలు, ఇంకా అలంకరణ వస్తువులు కొనుగోలు చేయడమే కాక.. అక్కడే గాజులు తయారీ విధానాన్ని కూడా స్వయంగా వీరు పరిశీలించారు. నాలుగు గ్రూపులుగా విడిపోయి ఒక్కో గ్రూప్ రెండు షాప్ లలో షాపింగ్ చేసేలా ఏర్పాట్లు-చేశారు. అనంతరం చార్మినార్ నుంచి చౌమహల్లా ప్యాలెస్ వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. హెరిటేజ్ వాక్ కు అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ డైవర్షన్ విధించారు. పహెల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాతబస్తీ వీధులన్నీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మదీనా, చార్మినార్, శాలిబండ, వొల్గా జంక్షన్, ఖిల్వత్ రోడ్లను పూర్తిగా క్లోజ్ చేశారు. ఇవాళ రాత్రి 11 వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

### దద్దమ్మగా ఉన్న నిన్ను తంతే బీజేపీలోకి వెళ్లావు..

**హైదరాబాద్:** బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను బీసీ బిడ్డగా ఎవరూ ఆమోదించడం లేదని, ఆయన అసలు ము దిరాజ్ కులానికి చెందిన వారో, లేక రెడ్డి కులానికి చెందిన వారో చెప్పాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో అనుభవమున్న నాయకుడు రాజేందర్‌కు ఇంత దిగజారుడు తనం ఎందుకో అర్థం కావడం లేదని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఇష్టారాజ్యంగా మాట్లాడడం తగదని, ఇక ముందు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉంటే మంచిదని హెచ్చరించారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, పీసీసీ నేతలు ఈర్ల కొమురయ్య, సలీం, గజ్జి భాస్కర్, ఇందిరా శోభన్‌లతో కలసి ఆయన మాట్లాడుతూ.. ఈటల బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రావడం లేదనే నిస్పృహలో ఉన్నారని, అందుకే కిషన్‌రెడ్డిపై ఉన్న ఆక్రోశాన్ని రేవంత్‌పై వెళ్లగక్కుతున్నారని చెప్పారు. కేసీఆర్ పాలన లోని అలీబాబా 40 దొంగల్లో ఈటల కూడా ఒక సభ్యుడని, రాష్ట్రం అప్పుల పా లు కావడానికి కేసీఆర్‌తో పాటు ఈటల నిర్వాకం కూడా కారణమని పేర్కొన్నా రు. దద్దమ్మగా ఉన్న ఈటలను అప్పుడు బీఆర్ఎస్ నుంచి తంతే వెళ్లి బీజేపీలో ప డ్డారని, మళ్లీ ఇప్పుడు అక్కడ ఇమడలేక కేసీఆర్‌వైపు చూస్తున్నట్టున్నారని ఎద్దేవా చేశారు. సీఎంను ఉద్దేశించి ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని, తాము ఒక్క విజిలేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఏం చేస్తారో తెలియదని అ న్నారు. కేటీఆర్ బాణిలోనే రాజేందర్ మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతోంది కిషన్‌రెడ్డి, రాజేందర్ గ్యాంగేనని మండిపడ్డారు.



## అర్హులు మాత్రమే రేషన్ కార్డు కోసం దరఖాస్తులు సమర్పించాలి

### రాయికల్ తహసిల్దార్ ఖయ్యూం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 13 ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామాల్లో 1.5 లక్షలు పట్టణాల్లో 2 లక్షల లోపు ఆదాయం ఉన్నవారు మాత్రమే రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తాసిల్దార్ ఖయ్యూం కోరారు. జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణములోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని మీసేవ నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లింపు దారులు, సొంత కారు ఉన్నవారు, 3.5 ఎకరాల మాగాణి 7.5 ఎకరాల కంటే ఎక్కువ మెట్ట భూమి ఉన్నవారు రేషన్ కార్డు కోసం అనర్హులని అటువంటి వారు దరఖాస్తులు చేసుకోవద్దని సూచించారు. మీసేవ నిర్వాహకులు ఆహార భద్రత దరఖాస్తు తో పాటు దరఖాస్తుదారుని ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మరియు భూ ధ్రువీకరణ పత్రాలు జత చేసి కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తాసిల్దార్ గణేష్, ఆర్ ఐ లు పద్మయ్య, దేవదాస్ మరియు తాసిల్దార్ కార్యాలయం మీసేవ ఆపరేటర్ రాజేందర్ పాల్గొన్నారు.



## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంఎల్ఏ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 13 రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గారికి తీర్థ ప్రసాదాలు అందజేసి,శాలువా తో సత్కరించారు. వారి వెంట గ్రామ మండల నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నువ్వు చనిపోతే నేనెట్టా బతుకుతా బిడ్డా కొడుకు మరణాన్ని తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య.

### కరీంనగర్ జిల్లా లో హృదయ విదారక ఘటన



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 13

ఆకుటుంబంలో చోటుచేసుకున్న విషాదాన్ని మరవకముందే మరో విషాదకర ఘటన జరిగింది. కొడుకు బలవన్మరణానికి పాల్పడడంతో తట్టుకోలేకపోయిన అతడి తండ్రి కూడా అదే పనిచేశాడు.కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో ఈ విషాద ఘటనలు చోటు చేసుకున్నాయి. మన్నెంపల్లి గ్రామానికి చెందిన తిరుపతిరావు కొడుకు నిఖిల్ (21) బెట్టింగులకు అలవాటు పడ్డాడు. అందుకోసం లక్షలాది రూపాయలు అప్పులు చేశాడు. చివరకు అప్పులు తీర్చే దారి కనపడక తీవ్ర ఒత్తిడితో రెండు నెలల క్రితం బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. తిరుపతిరావుకు నిఖిల్ ఒక్కగానొక్క కొడుకు. నిఖిల్ మృతితో తిరుపతిరావు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. తిరుపతి రావు వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. అతడిని స్థానికులు హైదరాబాద్‌లోని ఒక ఆసుపత్రికి తరలించారు. తిరుపతిరావు చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రీకొడుకులు ఇద్దరూ మృతి చెందడంతో వారి కుటుంబం తట్టుకోలేకపోతోంది. బెట్టింగుల వల్ల యువత జీవితాలను నాశనం చేసుకోవడమే కాకుండా కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది. బెట్టింగుల జోలికి పోవద్దంటూ పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ చాలా మంది యువకులు తమ తీరును మార్చుకోవడం లేదు.



## బిజెపి రాష్ట్ర నాయకులు అంపాల పద్మా రెడ్డి మృతికి మాజీ మేయర్ సంతాపం.

సికింద్రాబాద్,వార్త మిర్రర్ మే 13 ....బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంపాల పద్మా రెడ్డి మృతి పట్ల మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి సంతాపం తెలియజేశారు. నాచారం కు చెందిన అంపాల పద్మా రెడ్డి క్యాన్సర్ బారిన పడి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మేయర్ నాచారంలోని పద్మా రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ప్రార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. పద్మా రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి, పరామర్శించి సానుభూతి ప్రకటించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఉన్న పద్మా రెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటు అన్నారు.అనంతరం జరిగిన పద్మా రెడ్డి అంతిమయాత్రలో మాజీ మేయర్ కార్తిక రెడ్డి తో పాటు బిజెపి నాయకులు బండ చంద్రారెడ్డి, జిల్లా నాయకులు రాగిరి మోహన్ రెడ్డి,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 3 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాము

### తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల్ నాగేశ్వరరావు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 13

రాష్ట్రంలో 3 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, సన్న వడ్లకు 500 బోనస్ ఇస్తూ, రేషన్ కార్డు పై బీద మధ్యతరగతి ప్రజలకు సన్న బియ్యం పంపిణీ దేశంలో ఎక్కడా లేదని, ఇది ఒక చరిత్ర అని తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల్ నాగేశ్వరరావు అన్నారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామంలో రూ.13.38 కోట్లతో 20వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల్ నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ జగిత్యాల వ్యవసాయ ఆధారిత ప్రాంతమని. గోదాంల నిర్మాణం అత్యంత ఆవశ్యకమని, ఏడాది కాలంలో గోదాంను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తాన్నారు. 5 నుండి 10 లక్షల టన్నుల గోదాంల నిర్మాణం చేపట్టే కార్యక్రమం చేపట్టామని. ఇప్పటివరకు 2.5 లక్షల టన్నుల గోదాంలకు ప్రణాళిక సిద్ధం చేయటం జరిగిందన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ గోదాంల నిర్మాణంతో కూలీలకు ఉపాధి, రైతులకు అత్యంత ప్రయోజనంగా ఉంటుందని, మద్దతు ధర లేని పంటలకు ధర వచ్చే వరకు గోదాంలలో నిల్వ చేసుకోవచ్చు, తర్వాత లాభం పొందవచ్చున్నారు. గత 10 ఏండ్ల లో 20వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మిస్తే, ఈ ఏడాదిలో 20వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మించబోతున్నామన్నారు. మరో 20 వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణం అవసరం ఉందని, జగిత్యాలకు రైల్వే స్టేషన్ కూడా అందుబాటులో ఉందని గోదాం అవసరం చాలా అన్నారు. గోదాంకు వచ్చే రహదారి విస్తరణ చేయాలని, వాహనాల రాకపోకలు గ్రామానికి ఇబ్బంది కాకుండా బైపాస్ రోడ్డు విస్తరణ చేపడతాం అని అన్నారు. లక్ష్మి పూర్ గ్రామంలో సీడ్ ప్రాసెస్ యూనిట్ నిర్మాణం పూర్తి అయింది అని, కొంత యంత్ర సామగ్రి కొరత ఉందని దానిని పూర్తి చేయాలని కార్పొరేషన్ చైర్మన్ ను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల డిఇ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరినాగభూషణం, నాయకులు నక్కల రవీందర్ రెడ్డి, సదాశివ రావు, గడ్డం నారాయణ రెడ్డి, చెరుకు జాన్, అంకం సతీష్, మహేశ్వర్ రావు, గిద్దె శంకర్, నారాయణ గౌడ్, బోనగిరి నారాయణ తదిరులు పాల్గొన్నారు.

# కనగల్ పోలీసుల అత్యుత్సాహం

### గాయాల పాలై చికిత్స పొందుతున్న యువకుడిని పరామర్శించిన తుమ్మల వీరారెడ్డి

### కనగల్ ఎస్సై, మరో ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలి



నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి : నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న నవీన్ ను సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పరామర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో పెండ్లి పోలీస్ అంటే ఇదేనా కనగల్ ఎస్సై మరియు కానిస్టేబుల్ కలిసి పచ్చికారం కంట్లో పోసి, రోకలిబండ మోకాళ్ళపై తొక్కుతూ చిత్రహింసలకు గురి చేశారు అదేవిధంగా మెడపై ఇనుప రాడ్లతో దాడి చేశారు. మోకాలు చిప్ప పూర్తిగా దెబ్బ తినడం జరిగింది కనీసం శరీర భాగాలు చచ్చుపడిపోయినాయి పోలీసులు కస్టడీ అంటే 24 గంటల లోపలనే చట్టపరంగా అరెస్టు చేయాలి కానీ మూడు,నాలుగు రోజులు పోలీసులు మరియు ప్రైవేట్ వ్యక్తులతో తమ కస్టడీలో ఉంచుకొని శారీరకంగా మానసికంగా బాగా వేధించారు తప్పు ఉంటే చట్టబద్ధంగా శిక్షించాలని ఈ విధంగా కొట్టడం ఏందని ప్రశ్నించారు. ఎస్పీ వెంటనే ఎస్ఐని మరియు కానిస్టేబుల్ ను సస్పెండ్ చేయాలని ఇందులో భాగమైన ప్రైవేట్ వ్యక్తుల పైన చట్టపరంగా శిక్షించాలని భవిష్యత్తులో ఇలాంటి పునరావృత్తం కాకుండా చూడాలని, నవీన్ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. వీరి వెంట సిపిఎం పట్టణ దండంపెల్లి సత్తయ్య, హాలియా మండల కార్యదర్శి అవుత సైదులు, నవీన్ తల్లి కుంచెం యాదమ్మ, వారి కుటుంబ సభ్యులు కుంచెం వెంకట్ రాములు, శివ ఎల్లయ్య అంజయ్య తదితరులు ఉన్నారు.

# దమ్ముంటే లోకల్ బాడీ ఎన్నికలు పెట్టండి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. సబితా ఇంద్రారెడ్డి



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి...మే 13 మహేశ్వరం నియోజకవర్గంలోని జల్పల్లి మున్సిపాలిటీ ప్రీమియర్ ఫంక్షన్ హాల్‌లో కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 380 చెక్కులు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి కష్టం వస్తే ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక నానా ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు ఈ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. కానీ ఆ హామీలను పూర్తిగా విస్మరించి ప్రజల విశ్వాసాన్ని ద్రోహించింది. ఇప్పటికీ ప్రజల్లోకి వెళ్లే ధైర్యం లేని విధంగా లోకల్ బాడీ ఎన్నికల నిర్వహణను వాయిదా వేస్తున్నారు. దమ్ముంటే వెంటనే ఎన్నికలు పెట్టండి. ప్రజలే మీకు తగిన బుద్ధి చెబుతారు, అని తీవ్రంగా ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.ప్రజాసంక్షేమమే మా లక్ష్యంమేము అధికారంలో ఉన్నప్పుడు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా పేద ప్రజలకు ఆర్థిక భరోసా అందించాం. ఈ కార్యక్రమాల ద్వారా మహిళల జీవితాల్లో వెలుగు నింపే ప్రయత్నం చేశాం. ఇప్పటికీ ప్రజల సంక్షేమమే మా ప్రథమ ప్రాధాన్యత, అని సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల తాసిల్దార్ ఇందిరా దేవి, జలపల్లి మున్సిపాలిటీ కమిషనర్ మాజీ చైర్మన్ వైస్ చైర్మన్ మాజీ కౌన్సిలర్లు మాజీ కో ఆప్షన్ సభ్యులు బీఆర్ఎస్ పార్టీ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

### గిరిజన బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపల్ లింగస్వామి



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి బైపీసీ, ఎంపీసీ విభాగంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లింగస్వామి మంగళవారం తెలిపారు. గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులుసంస్థాన్ నారాయణపురం, మే 13 : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి బైపీసీ, ఎంపీసీ విభాగంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లింగస్వామి మంగళవారం తెలిపారు. ఈ నెల 15వ తేదీన మిర్యాలగూడలోని అవంతిపురం గిరిజన గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు పదో తరగతి మార్కుల మెమో, స్టడీ కండక్ట్ సర్టిఫికెట్, మూడు పాస్ ఫోటోలు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో కౌన్సిలింగ్ హాజరు కావాలని సూచించారు.



## ఆలయాల నిర్మాణం సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక

### ::: విగ్రహదాత ఉప్పల వెంకటేష్

కల్వకుర్తి మే 13 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మున్సిపల్ పట్టణానికి చెందిన భగత్ సింగ్ తండాలోని నూతన దేవాలయంలోని విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూ" 25,000 రూపాయల ఆర్థిక సహకారం అందించడం జరిగింది. ఈ నెల 16,17,18,19 తేదీలలో జరిగే బ్రహ్మోత్సవాలకు కూడా రావలసిందిగా ఉప్పల వెంకటేష్ కి ఆహ్వానం అందించిన భగత్ సింగ్ తండా ఆలయ కమిటీ చైర్మన్ మరియు సభ్యులు.ఈ కార్యక్రమంలో ఉప్పల వెంకటేష్ అన్న సైన్యం, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్ధమోని రమేష్ గౌడ్ ,భగత్ సింగ్ తండా నాయకులు రాజు నాయక్, బాలు నాయక్, హర్యా నాయక్, దేవేందర్ నాయక్, భాస్కర్ నాయక్, బోడు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ మెంబర్ గా జిల్లెల్ల రాములు

కల్వకుర్తి మే 13 వార్త మిర్రర్ ప్రతినిధి:- నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములును నాగర్ కర్నూల్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ మెంబర్ గా నియమించారు. ఈ సందర్భంగా జిల్లెల్ల రాములు ప్రభుత్వం తన పై నమ్మకం ఉంచి తననియమాకానికి సహకరించిన కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి కి హైదరాబాదులో వారి స్వగృహంలో కలిసి పుష్పగుచ్చం అందించి కృతజ్ఞత తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పై నమ్మకంతో నాకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి ఎస్సీ ఎస్టీలకు తగు న్యాయం చేస్తానని జిల్లెల్ల రాములు అన్నారు.ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యులు బాలాజీ సింగ్,కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, మాజీ కౌన్సిలర్స్ గోరటి శ్రీను,చిన్న రాం రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, షానవాజ్, మాజీ సర్పంచ్ లు దామోదర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ నాయక్, హరిశ్వర్ రెడ్డి, రవిగౌడ్, కురమిద్ద రవి, భాస్కర్,చంద్ర కాంత్, వెంకటేష్, సురేష్, పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎస్ఐఆర్-ఐఐసిటి సీనియర్ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త, డాక్టర్ సూర్య ప్రకాష్ సింగ్ గౌరవ ఐ ఎన్ఎస్ఏ డిస్టింగ్విష్డ్ లెక్చర్

ఫెలోషిప్ (2025) అందుకున్నారు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ మే 13 ...డాక్టర్ సూర్య ప్రకాష్ సింగ్, సిఎస్ఐఆర్-ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సిఎస్ఐఆర్-ఐఐసిటి), హైదరాబాద్ ప్రముఖ పరిశోధనా శాస్త్రవేత్త, భారత జాతీయ శాస్త్ర అకాడమీ (INSA) నుండి 2025 సంవత్సరానికి గౌరవనీయమైనINSAడిస్టింగ్విష్డ్ లెక్చర్ ఫెలోషిప్పు అందుకున్నారు. ఈ గుర్తింపు భారతదేశవ్యాప్తంగా అద్భుతమైన యువ శాస్త్రవేత్తల పనులను ప్రతిపాదించే అకాడమి యొక్క ప్రయత్నాలలో ఒకటిగా ఉంది. ముఖ్యంగా, డాక్టర్ సింగ్ సిఎస్ఐఆర్-ఐఐసిటి మరియు హైదరాబాద్ నగరానికి చెందిన తొలి పరిశోధకులు, ఈ గౌరవాన్ని అందుకున్నట్లు, ఇది సంస్థకు మరియు ప్రాంతానికి ఒక మైలురాయి.డాక్టర్ సింగ్ సిఎస్ఐఆర్-ఐఐసిటిలో ఉత్పత్తి శాస్త్రం, పదార్థ శాస్త్రం వంటి వాస్తవ ప్రపంచ అనువర్తనాలతో అనువాద పరిశోధనపై దృష్టి సారించిన ఒక డైనమిక్ పరిశోధన సమూహాన్ని ఆధ్వర్యం వహిస్తున్నారు. ఆయన పని ప్రగతిశీల సౌర సాంకేతికతలను మెరుగుపరిచే అద్భుతమైన అణు పదార్థాలను, ముఖ్యంగా ఫోటోసెన్సిటైజర్లను రూపొందించడంపై కేంద్రితమై ఉంటుంది. ఈ సాంకేతికతలు డై-సెన్సిటైజ్డ్, ఆర్గానిక్, మరియు పెరోవస్కైట్ సౌర సెల్ల వంటి తదుపరి తరగతి సౌర టెక్నాలజీల సామర్థ్యాన్ని పెంచడానికి ఉన్నాయి. ఆయన ఇంటర్డిసిప్లినరీ దృష్టికోణం ఆర్గానిక్ రసాయన శాస్త్రం, పదార్థ శాస్త్రం, మరియు పరికరం ఇంజనీరింగ్ సమాహరించి, పునరుత్పత్తి శక్తి సమస్యలను పరిష్కరించేందుకు సహాయపడుతుందన్నారు. డాక్టర్ సింగ్ యొక్క పరిశోధనలో ఒక ప్రధాన సాధనంగా ఉన్నది జైవిక వ్యవస్థలలో మైటోకాండ్రియల్ ఇమేజింగ్ కోసం న్యూట్రల్, నాన్- టాక్సిక్, స్థిరమైన, మరియు అధిక పురసెంటు %దీూణ-శ్రూ% డైజ్ల అభివృద్ధి. ఈ ఆవిష్కరణ శాస్త్రీయ బయోమెడికల్ ఉపయోగాలకు ప్రతిపాదించబడింది. డాక్టర్ సింగ్ ప్రతిష్టిత పురస్కారాలను గెలుచుకున్నాడు, అవి CRSI బ్రాంజ్ మెడల్ (2024), -యంగ్ సైంటిస్ట్ ప్లాటినం జూబ్లీ అవార్డు (2012), AVRA యంగ్ సైంటిస్ట్ అవార్డు (2015), మరియు ద్వారా భాస్కరా అడ్వాన్స్ సౌర ఎనర్జీ ఫెలోషిప్. అలాగే, ఆయన ఉత్తరప్రదేశు రాష్ట్ర ప్రభుత్వ శాస్త్ర మరియు సాంకేతిక మండలి నుండి గౌరవం పొందారు మరియు 2024లో అసోసియేట్ ఫెలోగా ఎన్నికయ్యారు. ఆయాఅగ్రగ్రంథాలలో 245కు పైగా పత్రాలను ప్రచురించారు. ఆయన పని శాస్త్రీయ జ్ఞానాన్ని అభివృద్ధి చేస్తూ, శుభ్రమైన శక్తి మరియు స్థిరమైన సాంకేతికతలలో అత్యంత అవసరమైన సామాజిక అవసరాలను తీర్చడంలో కృషి చేస్తోంది.

## ప్రభుత్వ ఏరియా దవఖానలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఉయ్యాల కార్యక్రమం

మిర్యాలగూడ, మే 13:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో ఊయల కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత మాట్లాడుతూ తల్లిదండ్రులకు భారంగా పెంచ లేని స్థితి అనిపించిన శిశువులను అనారోగ్యం కారణంగా జన్మించిన శిశువులను అలాగే శిశువులకు జన్మనిచ్చి సమాజానికి భయపడి జన్మనిచ్చిన శిశువులను ఎక్కడో చెత్తకుప్పలో కాలువల్లోనూ పడేస్తూ ఎన్నో శిశు మరణాలకు కారణాలు అవుతున్న సమయంలో అటువంటి అనర్థాలు జరగకుండా ఆపడమే ఊయల కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. శిశువులను ఉయ్యాలలో వేయడం వలన శిశువులను జిల్లా పరిధిలో గల శిశుగృహకు పంపించి శిశువు ఆలనా పాలనను చూసుకోవడం జరుగుతున్నదన్నారు. అలాగే ఎవరికైనా పిల్లలు దత్తత కావాలనుకుంటే తల్లిదండ్రులకు లీగల్ గా చట్టపరమైన దత్తత ఇవ్వడం జరుగుతుందన్న విషయం ప్రతి ఒక్కరికి తెలిసేలా అందరూ కృషిచేయాలని వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రారంభించినట్టు ఆమె తెలిపారు.కార్యక్రమంలో ఏరియా హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సమరత్ శ్రీనివాస్, చైల్డ్ ప్రొటక్షన్ కమిటీ చైర్మెన్ చింత కృష్ణయ్య, లీగల్ అడ్వైజర్ వెంకన్న, సోషల్ వర్కర్ రమణి, శిశు గృహ మేనేజర్ దుర్గా, సూపర్ వైజర్స్ ఎం.లీలాకుమారి కె.నాగమణి, నజీమబేగం మహమ్మద్ సిహెచ్.పద్మ అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు



## మిర్యాలగూడ మున్సిపల్ పాలిటి పరిధిని పరిశీలించిన రీజనల్ డైరెక్టర్

### ఎన్ఎంఆర్ కార్మికుల రెగ్యులేషన్ రికార్డును పరిశీలించి అసహనం వ్యక్తం





మిర్యాలగూడ మే 1 3:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఎన్ఎంఆర్ ల రెగ్యులరైజెషన్ గురించి రికార్డులను మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ జే.శ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. 1999లో సుమారు 9 మంది ఎన్ఎంఆర్ కార్మికులను పర్మినెంట్ చేయడంలో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలు ఉన్నాయని, పరిశీలించి అనంతరం కార్మికుల రికార్డులు సక్రమంగా లేవని తెలిసిందన్నారు. రాష్ట్రంలో లే అవుట్ రెగ్యులరైజెషన్ స్కీంకు ఏప్రిల్ నెలలో స్పందన బాగుండటంతో పొడిగించడం జరిగిందని తెలిపారు. మిర్యాలగూడ మున్సిపల్ పని తీరు బాగుందని ఆయన తెలిపారు. అనంతరం ఆయన పట్టణ పరిధి రాంనగర్ లో ఉన్న డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డును రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పరిశీలించారు. డంపింగ్ యార్డులో వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయాలని, చెట్లు పెంచి ఆహ్లాదకరంగా ఉంచాలని కోరారు. యార్డుకు రోడ్డు నిర్మించాలని కోరారు. ప్రస్తుతమున్న డంపింగ్ యార్డు 6 ఎకరాల్లో విస్తరించి ఉన్నదని సరిపోవడం లేదని ఆయనకు మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ వివరించారు. స్థల సేకరణ కోసం జిల్లా కలెక్టర్ కు నివేదించామని తెలిపారు. ఆయన వెంట రెవిన్యూ ఆఫీసర్ జి.జ్ఞానేశ్వరి, టిపిఎస్ అంజయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ ఇంజనీర్ శ్వేత, జెఎఓ కల్యాణి, శంకర్, షహబాజ్ ఉన్నారు.

## కాంగ్రెస్ పాలనలో కళ తప్పిన రైతు వేదికలు.. పెరిగిన రైతన్నల ఆత్మహత్యలు

### బిఆర్ఎస్ నేత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి నాడు బీఆర్ఎస్ హయాంలో నిత్యం రైతులతో కళకళలాడిన రైతు వేదికలు, నేడు కాంగ్రెస్ పాలనలో నిర్వహణ లేక కళ తప్పయని అన్నారు ఇప్పటివరకు రైతు వేదికలకు నిధులు మంజూరు చేయకుండా, తెలంగాణలో కెసిఆర్ పాలనలో చక్కగా ఉన్న రైతు సంక్షేమం, కుల వృత్తుల సంక్షేమం, మహిళా సంక్షేమం ఇలా ఎన్నో వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసి అసమర్థత పాలన నడుస్తుందని ఆరోపించారు. మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప ఆర్భాటాలు ప్రచారాలు చేసుడే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు పంట చేతికి రాక కరెంటు సరిగ్గా లేక రైతుబంధు రైతు భీమా.! అందక రైతులు ఆత్మహత్యలు జరుగుతున్నావని ఆరోపించారు తెలంగాణలో రైతు రాజ్యం రావాలంటే, ఇంటింటికి సంక్షేమ పథకాలు అందాలంటే మళ్ళీ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలని, గ్రామ గ్రామాన గులాబీ జెండాలు ఎగరాలని తెలిపారు బిఆర్ఎస్ నేత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

## సిబిల్ స్కోర్ వెంటనే తొలగించి. అర్హులకు మాత్రమే రాజీవ్ యువ వికాసం రుణాలు అందించాలి

### - దబ్బటి శేఖర్



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 13

సామాజిక కార్యకర్త , సమాచార హక్కు రక్షణ చట్టం - 2005 యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దబ్బటి శేఖర్ పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం రేషన్ కార్డు కలిగి ఉండి నిరుద్యోగులు తెలంగాణ రాష్ట్ర ప్రజలు కొన్ని లక్షల మంది ఎన్నో ఆశలతో రాజీవ్ యువ వికాసం అప్లై చేసుకున్నారు ఈ మధ్యకాలంలో సిబిల్ స్కోర్ ఉంటేనే లోన్ ఇస్తామని అనడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని పేద ప్రజలను అర్థం చేసుకోవాలి అని సిబిల్ స్కోర్ ను వెంటనే తీసివేయాలని రాజీవ్ యువ వికాసం పథకం అప్లై చేసుకున్న ప్రజలు పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ చేసి అర్హులైన వారందరికీ లబ్ధిదారులను ఎంపిక చేయాలని పత్రిక ప్రకటనలో సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాను



## ప్రసిద్ధ హిందూ శైవ క్షేత్రం రామేశ్వరం దివ్య క్షేత్రాన్ని దర్శించుకున్న తెలంగాణ మైండ్స్ అండ్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పందుల యాదగిరి గౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : భారతదేశంలోని తమిళనాడుకు చెందిన రామేశ్వరం ద్వీపంలో ఉన్న ప్రసిద్ధ హిందూ శైవ క్షేత్రం ప్రసిద్ధి క్షేత్రంగా బాసిల్లిన దేవాలయాన్ని దర్శించుకున్న ప్రముఖ తెలంగాణ మైన్స్ అండ్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పందుల యాదగిరి దంపతులు ఈ సందర్భంగా పందుల యాదగిరి మాట్లాడుతూ 12 జ్యోతిర్లింగాలలో ఒకటి ఈ క్షేత్రాన్ని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు ప్రతి ఒక్క హిందువు 12 జ్యోతిర్లింగాలను దర్శించుకోవాలని సూచించారు.



## సుధాకర్ మాదిగను పరామర్శించిన మంద కృష్ణ

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి.. మే 13: ఇటీవల ప్రమాదానికి గురై కాలు ఫ్యాక్చర్ తో బాలాపూర్ చౌరస్తాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా నాయకులు బత్తిన సుధాకర్ మాదిగను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. సుధాకర్ మాదిగ త్వరగా కోలుకుని, ప్రజలకు తన సేవలు అందించాలని ఆకాంక్షించారు. సుధాకర్ మాదిగ ప్రమాదానికి గురికావడం చాలా ఆవేదనకు గురిచేస్తుందన్నారు. సుధాకర్ మాదిగకు వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ నా సహాయ సహకారాలు, మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.




## ఒక్కసారి చెల్లిస్తే చాలు.. జీవితాంతం లక్ష రూపాయల పెన్షన్

ఒక యాన్యుటీ ప్లాన్. దానిని కొనుగోలు చేసిన తర్వాత మీరు దానిలో మీ పెన్షన్ పరిమితిని నిర్ణయించవచ్చు. దీనిలో నిర్ణయించబడిన పెన్షన్ మీకు పదవీ విరమణ తర్వాత జీవితాంతం అందుతుంది. మీరు 55 సంవత్సరాల వయస్సులో ఈ ప్లాన్ను..ప్రతి ఒక్కరూ తమ సంపాదన నుండి కొంత మొత్తాన్ని ఆదా చేసి అలాంటి ప్రదేశంలో పెట్టుబడి పెట్టాలని ప్లాన్ చేసుకుంటారు. డబ్బు సురక్షితంగా ఉండే చోట, తన పెట్టుబడిపై గొప్ప రాబడిని పొందే చోట పెట్టుబడికి ప్లాన్ చేసుకుంటారు. నేటి కాలంలో అనేక పెట్టుబడి ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఈ రోజు మనం దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసీ పథకం గురించి తెలుసుకుందాం. ఇది మీ వృద్ధాప్యాన్ని మెరుగుపరుస్తుంది. ఎల్ఐసీ పదవీ విరమణ పథకం బాగా ప్రాచుర్యం పొందింది. ఇది పదవీ విరమణ తర్వాత మీకు ఆర్థిక భద్రతను అందిస్తుంది. ఈ పథకం పేరు న్యూ జీవన్ శాంతి ప్లాన్.

## ఈ చిట్కాలు పాటిస్తే మీరు ధనవంతులే.. మీ ఆదాయం పదింతలు


జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడానికి ప్రతి ఒక్కరూ అనేక విధాలుగా కష్టబడతారు. ఉద్యోగం, వ్యాపారం, పెట్టుబడులు తదితర వాటి ద్వారా డబ్బులు సంపాదించడానికి ప్రయత్నిస్తారు. వచ్చిన ఆదాయాన్ని పొదుపుగా ఖర్చుచేసి, మిగిలిన దాన్ని దాచుకుంటారు.సాధారణంగా ఎక్కువ గంటలు పనిచేసి, ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఉంటారు. కానీ ఈ విధానం నేటి కాలానికి సరిపోదు. ఎక్కువ గంటలు కాదు, ఎక్కువ నైపుణ్యంతో అధిక ఆదాయం సంపాదించాలని నిపుణులు చెబుతున్నారు. ఆదాయాన్ని పది రెట్లు పెంచుకోవడానికి వారు చెప్పిన చిట్కాలను ఇప్పుడు తెలుసుకుందాం.నైపుణ్యంఅధిక డిమాండ్ ఉన్న పనులకు సంబంధించిన నైపుణ్యాన్నిపెంచుకోవాలి. కాపీ రైటింగ్, కోడింగ్, యూఐయూఎక్స్ డిజైన్, విక్రయాలు, చెల్లింపుల ప్రకటనలను నేర్చుకోవాలి. వీటి ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చు.డిజిటల్ ఉత్పత్తులుడిజిటల్ ఉత్పత్తులను రూపొందించించి, విక్రయించడం ద్వారా ఎక్కువ ఆదాయం పొందవచ్చు. ఆన్ లైన్ కోర్సులు, ఈ-బుక్ లు, టెంప్లేట్లు, టూల్ కిట్లు తదితర ఆన్ లైన్ ఉత్పత్తులను రూపొందించండి. వీటిని ఒక్కసారి తయారు చేస్తే కనీస నిర్వహణతో ఏళ్ల తరబడి ఆదాయం పొందవచ్చు.ఆర్టిఫీషియల్ ఇంటిలిటజెన్స్ (ఏఐ)తో అనేక పనులను చాలా సులువుగా చేయవచ్చు. ఇ-మెయిల్స్ పంపడం, పోస్టులను షెడ్యూల్ చేయడం, విజువల్స్ డిజైన్ .. ఇలా వివిధ పనులు చేసుకోవచ్చు. వీటి ద్వారా ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉంటుంది. చాట్ జీపీటీ, జేపియర్, నోషన్ ఏఐ, కన్వెర్ట్ కిట్ తదితర ఏఐ సాధనాలపై అవగాహన పెంచుకోవాలి.



## రియల్ ఎస్టేట్ లో పెట్టుబడి పెడుతున్నారా..? జాగ్రత్తలు తీసుకోకపోతే ఇక అంతే.

భారతీయ సంప్రదాయంలో పండగలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి అందరూ ఎంతో ఉత్సాహంగా జరుపుకొంటారు. దసరా, దీపావళి, హెూలీ.. ఇలా ఏ పండగ వచ్చినా అందరూ సొంత గ్రామానికి చేరుకుని సంబరాలు చేసుకుంటారు. అలాగే పండగల రోజు కొత్త పని చేయడం శుభప్రదంగా భావిస్తారు. ఆ రోజు బంగారు ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేయడం, రియల్ ఎస్టేట్ లో పెట్టుబడులు పెట్టడానికి ప్రాధాన్యమిస్తారు.నేడు భూమి విలువ రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతి ఒక్కరూ వాటిని కొనడానికి ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ రంగం ప్రగతి పథంలో దూసుకుపోతోంది. అయితే ఈ రంగంలో పెట్టుబడి పెట్టే ముందు కొన్ని అంశాలను గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు. అవి ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.ప్రాథమిక అంశాలురియల్ ఎస్టేట్ సంస్థలు తమ భూములను కొనుగోలు చేసేవారికి అనేక ఆకర్షణీయమైన డిస్కౌంట్లు ప్రకటిస్తాయి. వాటినే కాకుండా కొన్ని ప్రాథమిక అంశాలపై కొనుగోలుదారులు అవగాహన పెంచుకోవాలి. భూమి ఉన్న ప్రదేశం, డెవలపర్ ట్రాక్ రికార్డు, ఆమోదాలు, మౌలిక సదుపాయాలు, ఇతర ప్రాంతాలతో కనెక్టివిటీ వంటి వాటిని చూసుకోవాలి. ప్రస్తుతం టైర్ 2 నగరాల్లో రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతోంది. తక్కువ ఈఎంఐలు, నో కాస్ట్ డౌన్ పేమెంట్, ప్రత్యేక పండగ పథకాలను అందజేస్తున్నారు.పన్ను ప్రయోజనాలురియల్ ఎస్టేట్ లోని పెట్టుబడులకు ఆదాయపు పన్ను చట్టం ప్రకారం కొన్ని మినహాయింపులు లభిస్తాయి. హౌసింగ్ రుణాలు, వాటి చెల్లింపులను కొనుగోలుదారులు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పెట్టుబడి పెడితే రాబోయే ఏడ్డాదిలో పన్ను ప్రయోజనం పొందవచ్చు.వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో జీతాలు పెరుగుతాయి. ఆ పెరిగిన మొత్తాన్ని రియల్ ఎస్టేట్ లో పెట్టుబడిగా పెడితే బాగుంటుంది. మీకు ఇష్టమైన పండగ రోజు ఈ నిర్ణయం తీసుకుంటే.. మీకు దీర్ఘకాలంలో ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఈ ఆర్థిక క్రమశిక్షణతో మీరు కొంత కాలానికి సొంతింటి వారవుతారు.అవగాహనరియల్ ఎస్టేట్ లో పెట్టుబడులు, ఇళ్ల కొనుగోలు తదితర విషయాలపై వెంటనే నిర్ణయం తీసుకోకూడదు. ముందుగా మార్కెట్ పరిస్థితులు, భూమి విలువ తదితర వాటిపై అవగాహన పెంచుకోవాలి. చాలా రియల్ ఎస్టేట్ కంపెనీలు తమ కస్టమర్లకు బంగారు నాణేలు తదితర వివిధ బహుమతులు అందిస్తాయి. అయితే భూమి విలువ, అనుకూలమైన ఫైనాన్సింగ్ నిబంధనలు, పారదర్శక లావాదేవీలు తదితర వాటిని కొనుగోలుదారులు ఆలోచించాలి. తాము పెట్టిన పెట్టుబడికి దీర్ఘకాలంలో మంచి రాబడి వచ్చేలా ఉండాలి. కాబట్టి భూమి విలువ, మార్కెట్ పరిస్థితులపై అవగాహన పెంచుకుని రియల్ ఎస్టేట్ లో పెట్టుబడి పెట్టాలి.మరిన్ని బిజినెస్ వార్తల కోసం ఇక్కడ క్లిక్ చేయండి

# జై..జపాండి




ఆసియా తూర్పు భాగంలోని జపాన్‌కు, ఐరోపాలోని స్కాండినేవియా ప్రాంతానికి పెద్దగా పోలికలు లేవు. ఒక్క గృహాలంకరణ విషయంలో మాత్రం.. ఉమ్మడి అభిరుచులు ఉన్నాయి. జపాన్‌లోని జపా, స్కాండినేవియాలోని ఆండీలను కలపగా ఏర్పడిన గృహాలంకరణ శాస్త్రమే జపాండి. మినిమలిజం జపాండి ప్రత్యేకత. ప్రకృతి సిద్ధమైన మెటీరియల్‌నే ఉపయోగిస్తారు. ప్లాస్టిక్, ఫైబర్ నిషిద్ధం. తేలికైన రంగులనే ఎంచుకుంటారు. ముదురు వర్ణాలు దూరం దూరం. సహజమైన వెలుగులకు విలువ ఇస్తారు. కృత్రిమ విద్యుత్ దీపాలు దాదాపుగా ఉండవు. చెక్క లేదా రాతితో చేసిన అలంకరణ వస్తువులు వాడతారు. ప్రతి మూలా పూలకుండీ ఉండాల్సిందే. గదిని ఫర్నిచర్‌తో నింపేయకుండా.. ఒకటి రెండు వస్తువులకే పరిమితం చేస్తారు. గదిలోకి సహజమైన వెలుతురు ధారాళంగా వచ్చేలా చూస్తారు. ఈ శైలిలో దాదాపుగా కర్టెన్లు ఉండవు. సూర్యకాంతిని అడ్డుకోవడం పాపమని నమ్ముతారు. తెలుపు, తేలికైన ఇసుక రంగు, లేత గచ్చకాయ రంగులకు జపాండి అలంకరణలో పెద్దపీట వేస్తారు. లేత బూడిద, లేత గులాబీ, లేత నీలం, లేత ఆకుపచ్చ రంగులనూ జొప్పిస్తారు. ఫర్నిచర్ విషయానికి వస్తే రోజువారీ వాడుకలో పనికొచ్చే వాటికే స్థానం. అవసరానికి ఉపయోగపడని వస్తువు ఎంత అందంగా ఉన్నా.. వృథాయే అంటుంది జపాండి.



# అచ్చం అమ్మ చేయిలా..

అమ్మ అరచేయి పొట్ట మీద జోకొడుతుంటేనే బుజ్జి పాప నిద్రపోయేది. ఆ చేయి పక్కకు జరిగిందో నిద్రలేచే పిల్లలు ఎందరో. కానీ ఎంత సేపని చేయి తీయకుండా కూర్చోగలం. అలాంటి సందర్భాల్లో చక్కగా ఉపయోగపడేలా 'బేబీ స్లీప్ సూతింగ్ పామ్ పిల్లోస్' దొరుకుతున్నాయి. ఇవి అచ్చంగా నూలుతో చేసినవి. మనుషుల చేతిని పోలి ఉంటాయి. అంతేకాదు, మీద చేయి వేసినట్టే అనిపించేందుకు కాస్త బరువు జోడించి రూపొందిస్తున్నారు. అందువల్ల ఈ 'చేయి దిండు'ను పాపాయి మీద ఉంచితే తన మీద ఎవరో చేయి వేసుకుని పడుకున్న అనుభూతిని పొందుతారు. హాయిగా నిద్రపోతారు. జాకీ అనే మరో సంస్థ కూడా జాకీ హగ్ పేరిట ఈ తరహాలో పిల్లలను చుట్టేసేలా.. చేతులను పోలిన దిండ్లను తయారు చేస్తున్నది. ఇవి కూడా బిడ్డలను నిద్రపుచ్చడానికి పనికొస్తాయి. వీటితో ఇటు అమ్మ ఎంచక్కా పనిచేసుకోవచ్చు, పాపాయి హాయిగా బజ్జోవచ్చు. ఐడియా అదిరింది కదూ!



# వెండికి వెలకట్టలేం


చాలామందికి వెండి అంటే చిన్నచూపు. నిజానికి ఆభరణంగా అయినా, పెట్టుబడిగా అయినా, వస్తువుగా అయినా.. వెండి వన్నెల ముందు వజ్రమైనా చిన్నబోవాల్సిందే. ఇదో మంచి పెట్టుబడి సాధనం కూడా.

వెండికి వెలకట్టలేం

చాలామందికి వెండి అంటే చిన్నచూపు. నిజానికి ఆభరణంగా అయినా, పెట్టుబడిగా అయినా, వస్తువుగా అయినా.. వెండి వన్నెల ముందు వజ్రమైనా చిన్నబోవాల్సిందే. ఇదో మంచి పెట్టుబడి సాధనం కూడా. ఇటీవల, ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో నిపుణులు రజతాన్ని ఆకాశానికి ఎత్తేశారు. గాలిలోని ఆక్సిజన్, సల్ఫర్ కణాల ప్రభావంతో వెండి రంగు మారుతుంది. కాబట్టి, గాలి చొరబడని సంచిలో వెండి వస్తువులను భద్రపరచాలి. ఒక్కో వస్తువును ఒక్కో కాగితంలో చుడితే.. వెండి పాత్రల మీద గీతలు పడకుండా కాపాడుకోవచ్చు. వెండిని భద్రపరిచే పాత్రలో ఓ బొగ్గు ముక్క లేదా సిలికా జెల్ ప్యాక్ కనుక వేస్తే.. అవి గాలిలోని తేమను శోషించుకుంటాయి. వెండి కళాత్మక వస్తువులకు వెల్వెట్ లేదా మైక్రోఫైబర్ ప్యాకింగ్ ఉత్తమం. రజతం అత్యుత్తమ పెట్టుబడి మార్గం కూడా. ద్రవ్యోల్బణాన్ని నిలువరించే శక్తి దీనికి ఉంది. ఆభరణాల మార్కెట్‌లో బంగారానికి ఉన్నంత ఆదరణ వెండికీ ఉంది. నిజానికి ట్రెండీ నగల తయారీ వెండితోనే సాధ్యం.

# గోడలపై.. ఘోరారణ్యం!

బాల్కనీలో తోటలనూ, కుండీల్లో మొక్కలనూ పెంచడం కాదు.. గోడల మీద ఏకంగా అడవుల్ని సృష్టించండి. అతిథులను ఆశ్చర్యానికి గురిచేయండి. ఇదీ ఓ కళే. ఓ చిన్న ఫ్రేమ్‌తో సరిపెడతారా, మొత్తం గోడకు విస్తరిస్తారా అన్నది మీ ఇష్టం. 'మోస్ వాల్ ఆర్ట్' ఇప్పుడు ఇంటీరియర్ డిజైనింగ్‌లో సరికొత్త ట్రెండ్. కార్పొరేట్ ఆఫీసుల ముస్తాబులోనూ భాగం అవుతున్నది. మొక్కలు, ఎండు కొమ్మలు, చిన్నచిన్న రాళ్లు, ఎండిన వేళ్లు, 0పూలు.. ఇవే ముడిసరుకు. అంత ఓపిక లేనివారికి ఆన్‌లైన్‌లో రెడీమేడ్‌గానూ దొరుకుతున్నాయి. వీటివల్ల ఇంటికి కొత్త అందం వస్తుంది. ఆహ్లాదంగానూ అనిపిస్తుంది.





# మండు వేసవిలో వినోదాల జల్లు



'ఇంద్రగంటి మోహనకృష్ణగారితో పనిచేయాలనే కోరిక ఈ సినిమాతో తీరింది. మండు వేసవిలో చల్లని వినోదాల జల్లులా ఈ సినిమా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. హాయిగా నవ్వించే ఫ్యామిలీ ఎంటర్‌టైనర ఇది' అన్నారు ప్రియదర్శి. ఆయన కథానాయకుడిగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన 'సారంగపాణి జాతకం' చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకురానుంది. రూపా కొడవాయూర్ కథానాయిక. బుధవారం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. క్రైమ్ కామెడీ కథాంశంతో ఆద్యంతం చక్కటి హాస్యంతో ఈ సినిమా తీశామని దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి తెలిపారు. ఈ సినిమా అవుట్‌పుట్ పట్ల చాలా సంతోషంగా ఉన్నామని, హిట్ గ్యారంటీ అని నమ్ముతున్నామని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. స్వతహాగా తాను జాతకాలు నమ్మనని, కానీ ఈ సినిమాలో నటించిన తర్వాత నమ్మడం మొదలుపెట్టానని కథానాయిక రూపా కొడవాయూర్ తెలిపింది. పుష్పకవిమానం టాకీగా వస్తే ఎలా ఉంటుందో 'సారంగపాణి జాతకం' అలా ఉంటుందని వెన్నెల కిషోర్ అన్నారు.



# స్పిరిట్ కోసం కసరత్తులు

ప్రభాస్-సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రాబోతున్న 'స్పిరిట్' చిత్రం ఎప్పుడు పట్టాలెక్కుతుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ 'రాజా సాబ్' 'ఫౌజీ' చిత్రాలను పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఆ తర్వాతే 'స్పిరిట్' సెట్స్‌పైకి వెళ్లనుంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ గురించి సోషల్‌మీడియాలో ఓ వార్త బాగా ప్రచారమవుతున్నది. నాలుగు నెలల పాటు అక్కడక్కడా చిన్న విరామాలతో షూటింగ్ జరుగనుందని, ప్రభాస్ 90రోజుల డేట్స్‌ను కేటాయించారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో ఆయన పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించబోతున్న విషయం తెలిసిందే. గతంలో చూడని విధంగా ఫిట్‌గా కనిపించాలనే సంకల్పంతో ప్రభాస్ ఫిజికల్ వర్కవుట్స్ మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారట. నిజాయితీ, ధిక్కార స్వభావం కలిగిన అగ్రెసివ్ పోలీసాఫీసర్‌గా ప్రభాస్ పాత్ర అభిమానుల్ని సర్‌ప్రైజ్ చేస్తుందని చెబుతున్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సైతం 'స్పిరిట్' గురించి ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సినిమా షూటింగ్ కోసం మెక్సికోలోని కొన్ని ప్రాంతాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# చౌర్య పాఠంలో ఏముంది?



ఇంద్రారామ్, పాయల్ రాధాకృష్ణ జంటగా నటిస్తున్న చిత్రం 'చౌర్య పాఠం'. నిఖిల్ గొల్లమారి దర్శకత్వంలో నక్కిన త్రినాథ రావు నిర్మిస్తున్నారు. ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకురానుంది. క్రైమ్ ఎలిమెంట్స్, డార్క్ హ్యూమర్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత త్రినాథ రావు నక్కిన చిత్ర విశేషాలు తెలియజేస్తూ.. చౌర్య పాఠం అంటే దొంగతనం చేయడానికి నేర్చుకునే ట్రిక్కులు కాదని, ఒక అవసరం కోసం దొంగతనం చేయాల్సి వచ్చినప్పుడు, ఈ క్రమంలో నేర్చుకునే విషయాలని తెలిపారు. ఈ డార్క్‌హ్యూమర్ క్రైమ్ కామెడీ కథలో చక్కటి లవ్‌స్టోరీ ఉంటుందని, సాంకేతికంగా అన్ని అంశాల్లో ఉన్నతంగా కనిపిస్తుందని ఆయన చెప్పారు. ప్రేక్షకులను ఆద్యంతం థ్రిల్‌కు గురిచేసే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశామని దర్శకుడు నిఖిల్ తెలిపారు. ఈ చిత్రానికి కథ, కెమెరా: కార్తీక్ ఘట్టమనేని, సంగీతం: దావ్‌జాండ్, నిర్మాత: నక్కిన త్రినాథ రావు, రచన-దర్శకత్వం: నిఖిల్ గొల్లమారి.



# ఫాలోవర్స్ ఉంటే ఏం లాభం?

అగ్ర కథానాయిక పూజాహెగ్డే ప్రస్తుతం 'రెట్రో' చిత్ర ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. సూర్య కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం మే 1న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సోషల్‌మీడియా గురించి పూజాహెగ్డే ఆసక్తికరమైన కామెంట్స్ చేసింది. తనకు ఇన్‌స్టాగ్రామ్‌లో 3కోట్ల మంది ఫాలోవర్స్ ఉన్నారని, అంతమాత్రాన వారందరూ టికెట్లు కొని సినిమాలు చూస్తారని గ్యారంటీ ఇవ్వలేం కదా అని వ్యాఖ్యానించింది. 'సోషల్‌మీడియా చాలా భిన్నమైన ప్రపంచం. ఏది నిజమో నిర్ధారణ చేసుకోలేం. కొంతమంది తారలకు 50లక్షల మంది ఫాలోవర్స్ మాత్రమే ఉంటారు. కానీ బాక్సాఫీస్ వద్ద వాళ్ల సినిమాలకు మంచి వసూళ్లు లభిస్తాయి. అందుకే వృత్తిపట్ల అంకితభావంతో ఉంటూ బయటి వారి నుంచి సినిమా తాలూకు ఫీడ్‌బ్యాక్‌ను తీసుకోవాలి. అప్పుడే వాస్తవాలు తెలుస్తాయి' అని పూజా హెగ్డే చెప్పింది. ప్రస్తుతం ఆమె మాటలు వైరల్‌గా మారాయి. లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'రెట్రో' చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందులో సూర్య గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఈ సినిమా నిర్మాణంలో సూర్య భాగస్వామిగా ఉన్నారు.



# పవన్ చిత్రంలో శింబు పాట

తమిళ హీరో శింబుకి పాటలు పాడటంలో కూడా చక్కటి ప్రావీణ్యం ఉన్న విషయం తెలిసిందే. తమిళ, తెలుగు భాషల్లో ఆయన ఇప్పటికే తనదైన గాత్రంతో సంగీత ప్రియుల్ని ఆకట్టుకున్నారు. తాజాగా ఆయన పవన్‌కల్యాణ్ 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్) చిత్రంలో ఓ పాటను ఆలపించారు. ఈ విషయాన్ని చిత్ర సంగీత దర్శకుడు తమన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'ఓజీ' చిత్రంలో శింబు పాట పాడనున్నారని గతంలోనే వార్తలొచ్చాయి. తాజాగా తమన్ ప్రకటనతో అది నిజమని రుజువైంది. 'ఫైర్ స్ట్రామ్' పేరుతో కంపోజ్ చేసిన ఈ పాటకు శింబు వాయిస్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. 'ఓజీ' సినిమా షూటింగ్ పునఃప్రారంభమైన తర్వాత ఈ పాటను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్, ఇమ్రాన్ హాష్మీ, అర్జున్‌దాస్, ప్రకాష్‌రాజ్ తదితరులు ముఖ్యపాత్రలను పోషిస్తున్నారు. ఇంకా కొంతభాగం చిత్రీకరణ మిగిలి వుంది. రాజకీయ కార్యకలాపాలకు కాస్త విరామం ప్రకటించి త్వరలో ఈ సినిమా షూట్‌లో పవన్‌కల్యాణ్ జాయిన్ అయ్యే అవకాశాలున్నాయని తెలిసింది.



# ఇప్పటివరకూ రాని కాన్సెప్ట్

శివరాజ్ కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా మూవీ '45'. అర్జున్ జన్యా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఉమా రమేష్ రెడ్డి, ఎం.రమేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకానుంది. బుధవారం టీజర్‌ను లాంచ్ చేశారు. ఇప్పటివరకు ఇండియన్ స్క్రీన్‌ప్లే రానటువంటి కాన్సెప్ట్ ఇదని, సనాతన ధర్మం గురించిన అంశాలు కూడా ఉంటాయని నిర్మాత తెలిపారు. నేటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టే చిత్రమిదని దర్శకుడు పేర్కొన్నారు. ఈ సినిమాలో తన పాత్ర చాలా కొత్తగా ఉంటుందని, క్లాస్..మాస్ ప్రేక్షకుల్ని మెప్పించే అన్ని అంశాలుంటాయని ఉపేంద్ర చెప్పారు. దర్శకుడు తనకు ఈ కథను నాలుగు నుంచి ఐదు నిమిషాల పాటు చెప్పాడని, అందుకే 45 అని టైటిల్ పెట్టామని శివరాజ్ కుమార్ తెలిపారు. ఈ చిత్రానికి కథ, సంగీతం, దర్శకత్వం: అర్జున్ జన్యా.



# 2209లో జరిగే కథ

కన్నడ అగ్ర హీరో కిచ్చా సుదీప్ '2209' పేరుతో ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. 2209లో జరిగే కథ ఇది. అనుప్ భండారి దర్శకుడు. 'హనుమాన్' చిత్ర నిర్మాణ సంస్థ ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించనున్నారు. బుధవారం ఈ సినిమా షూటింగ్‌ను మొదలుపెట్టారు. భారతీయ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ కథల పరంపరలో ఇదొక వినూత్నమైన ప్రయోగమని, ఓ సాహస యాత్రను ఆవిష్కరిస్తూ ఆద్యంతం థ్రిల్లింగ్‌గా సాగుతుందని, ప్రేక్షకులకు సరికొత్త థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: అనూప్ బండారి.